క్లుప్తంగా

గురుకులాల సందర్శన



గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న తహసీల్దార్ రాంబాబు

మధిర: కృష్ణాపురం గ్రామ సమీపంలో ఉన్న జ్యోతిబాపూలే సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలలను శనివారం తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని అన్ని గురుకులాలను సందర్శించి అక్కడ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆయా పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్, హాస్టల్ వార్డెన్లతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉన్నచోట తక్షణమే సంబంధిత అధికారులకు చెప్పి వాటి పరిష్కారానికి కృషి చేశారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం..

వైరా: త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండగా, వైరా నియోజకవర్గంలోని అన్ని స్థానాల నుంచి పోటీ చేస్తామని టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం, నాయకులు కృష్ణ మోహనరావు, చెరుకూరి చలపతి తెలిపారు. వైరాలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బలం ఉన్న ప్రతీచోట పోటీకి సిద్ధం కావాలని శ్రేణులకు సూచించారు. ఈ సమావేశంలో సురేంద్ర, వరలక్ష్మి, రామయ్య, అప్పారావు, కాటమరాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి..

బోనకల్: రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సత్తాచాటాలని ఆ పార్టీ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలో శనివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యలపై సీపీఐ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు పవన్, బాస్కర్‌రావు, కరుణాకర్, మధురం తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీకి యత్నం

మధిర: మధిర సుందరయ్య నగర్ ఆరో లైన్‌కు చెందిన చెరుకూరి నాగేశ్వరరావు ఇంట్లో శుక్రవారం రాత్రి దుండగులు చోరీకి యత్నించారు. నాగేశ్వరరావు రెండు నెలల క్రితం అమెరికాలో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దుండగులు తాళం పగలగొట్టగా విలువైన వస్తువులేవీ లభించక అంతా చిందరవందర చేసి వెళ్లిపోయారు. శనివారం ఉదయం తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన స్థానికులు నాగేశ్వరరావుకు ఫోన్‌లో సమాచారం ఇవ్వగా, ఇంట్లో విలువైన వస్తువులు ఏమీ లేవని ఆయన బదులిచ్చారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

వైరా: వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకర సుధాకర్ అన్నారు. శనివారం వైరాలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సుందరయ్యనగర్ శాఖా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది ఇందిరమ్మ కాలనీ వరద ముంపుకు గురికాగా, ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులపై చేసిన వ్యాఖ్యలను గుర్తుతెచ్చుకుని.. వరద ముంపు లేకుండా శాశ్వత చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, మోహన్‌రావు, సుధాకర్, మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నవీనజ్యోతి

వైరా: విద్యార్థి దశనుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నవీన జ్యోతి అన్నారు. శనివారం వక్తృత్వ పోటీలకు కావాల్సిన శిక్షణలో భాగంగా.. స్వాతంత్య్ర ఉద్యమఘట్టాలు, ఉద్యమంలో పాల్గొన్న నాయకుల పాత్ర, జాతీయ సమైక్యతలో యువత పాత్ర అనే అంశాలపై విద్యార్థులతో చర్చ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తుల విచారణ

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని తహసీల్‌లో శనివారం భూ భారతి దరఖాస్తులను రెవెన్యూ అధికారులు పరిశీలన చేసి విచారణ చేపట్టారు. భూభారతిలో 3040మంది రైతులు చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్, జూనియర్ అసిస్టెంట్లు బాజీబాబా, సురేష్, వరలక్ష్మి, తదితరులున్నారు.



వైఎస్ బంజర్ సమీపంలోని సాగర్‌కాల్వపై ఉన్న వేంసూరు ఎత్తి పోతల పథకం



సాగర్ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు



చుక్కనీరు లేని వేంసూరు పచ్చగన్నేరు కుంట

లిఫ్ట్ చేస్తేనే.. చెరువు నిండేది

- వర్షాలు కురుస్తున్నా నిండని చెరువులు
- ఈ ఏడాది కూడా ఆలస్యమవుతున్న బేతుపల్లి జలాలు
- సాగర్‌లో నీరు ఉన్నా.. నడవని లిఫ్ట్

వేంసూరు: మండలంలోని 3,700 ఎకరాలకు సాగు నీరు అందించడమే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాగార్జున సాగర్ కాలువపై వైఎస్ బంజర్ సమీపంలో వేంసూరు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువలో సాగు నీరు పుష్కలంగా చేరడంతో ఎత్తిపోతల పథకం అవసరం లేకుండా పోయింది. దీంతో నిర్వహణ సరిగా లేక పథకం మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారింది.

పునరుద్ధరణ పనులు చేపట్టిన బీఆర్ఎస్..

బేతుపల్లి జలాలు ఆలస్యమైతే సాగర్ జలాలను వినియోగించేందుకు వీలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. ప్రపంచ బ్యాంక్ నిధులతో వేంసూరు ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులు చేపట్టి బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువకు సాగర్ జలాలు తరలించింది. అక్కడ నుంచి సాగునీరు చెరువులకు చేరేలా అనుసందానం చేసింది. మోటర్లు సక్రమంగా పనిచేస్తున్నా.. అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని అన్న చందంగా మారింది ఎత్తి పోతల పథకం నిర్వహణ తీరు.

56 చెరువులకు సాగు నీరు..

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నా.. చెరువుల్లోకి ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. వేంసూరు ఎత్తిపోతల పథకం ద్వారా సక్రమంగా నడిపితే మండలంలోని.. లింగపాలెం, వేంసూరు, మర్లపాడు, లచ్చన్నగూడెం, వెంకటాపురం, అమ్మపాలెం, కందుకూరు, చౌడవరం, రాయుడుపాలెం గ్రామాల్లోని 56 చెరువులకు సాగునీరు అందుతుంది. అదే విధంగా ఎర్రగుంటపాడు వద్ద బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువలోకి చేరి.. లింగపాలెం నుంచి వెంకటాపురం, కల్లూరుగూడెం, గూడూరు చెరువులకు సైతం నీరు చేరుతుంది.

ఆవేదనలో అన్నదాతలు..

వేంసూరు ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురికాగా.. కాంగ్రెస్ ప్రభుత్వంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతో పాటు మోటార్లకు మరమ్మతులు కూడా చేశారు. అన్ని సక్రమంగా పనిచేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం నీరు విడుదల చేయడంలేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది బేతుపల్లి జలాలు ఆలస్యమే..

గతేడాది జూలై రెండో వారంలోనే బేతుపల్లి జలాలు వేంసూరు మండలానికి చేరాయి. మండలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోయిన బేతుపల్లి జలాలు చెరువులకు వస్తాయనే ధైర్యంతో ఇక్కడి రైతులు ఏటా పంటలు సాగు చేస్తారు. అయితే ఈ ఏడాది బేతుపల్లి జలాలు సైతం ఆలస్యం కావడంతో వేంసూరు మండలంలోని చెరువులు వెలవెలబోతున్నాయి. ప్రస్తుతం చెరువులో 13 అడుగులు నీరు ఉంది. మరో రెండు అడుగుల నీరు వస్తేనే మండలానికి నీరు విడుదల చేస్తారు. కావున నాగార్జున సాగర్ కెనల్‌కు నీరు వస్తుండటంతో వేంసూరు ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులకు సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరు అందించాలి..



నాగార్జున సాగర్ కెనల్ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని చెరువులకు సాగు నీరు తరలిస్తే పంటల సాగుకు ఉపయోగకరంగా ఉంటుంది. బోర్లు లేక నాట్లు వేయని రైతులు సైతం నాట్లు వేసేందుకు వీలుగా ఉటుంది. అధికారులు స్పందించి వేంసూరు ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులకు నీరు అందించాలి

– బొంతు భాస్కర్‌రావు, వేంసూరు

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



బోనకల్: ముష్టికుంట్లలో రైతులకు సూచనలు ఇస్తున్న మధిర ఏడీఏ స్వర్ణవిజయచంద్ర

బోనకల్/ఏన్కూరు: అధిక వర్షాల దృష్ట్యా పత్తిపంటలో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మధిర ఏడీఏ విజయ్‌చంద్ర, ఏఓలు పసునూరి వినయ్‌కుమార్, నర్సింహారావు తెలిపారు. శనివారం బోనకల్ మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో, ఏన్కూరు మండలంలోని రాంనగర్‌తండలోని పత్తి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెగులు సోకిన పత్తి మొదళ్ళను పీకి పత్తిపంటకు దూరంగా వేయాలన్నారు. అదేవిదంగా కాఫర్‌హైడ్రాక్సైడ్ 2గ్రాములు లీటర్ నీటికి కలిపి మిశ్రమాన్ని మొక్క మొదలు భాగం తడిచేవిదంగా వేసుకోవాలన్నారు. అధిక వర్షాల వలన పంటల్లో నీరు నిలిచి ఉంటే వాటిని వెంటనే బయటకు పంపించే ప్రయత్నం చేయాలన్నారు. వర్షపు నీరు నిలబడినచోట సూక్ష్మ దాతులోపం వచ్చే అవకాశం ఉంది కాబట్టి 10 గ్రాముల యూరియా లేదా 19.19.19లేదా 13–0–45 లీటర్ నీటికి కలుపుకోని వారం వ్యవదిలో 2సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. అదేవిదంగా రైతులు అందరూ నానో యూరియా వాడడం ద్వారా పంట ఉత్పత్తి,ఉత్పాధకత పెంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి మరీదు త్రివేణి, ఏఈఓ బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

నిర్ణీత ధరలకే ఎరువులు విక్రయించాలి



ఎర్రుపాలెం సొసైటీలో యూరియా నిల్వలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ , ఏఓ

చింతకాని/ఎర్రుపాలెం/ముదిగొండ: ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులను విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మధిర ఏడీఏ విజయ్‌చంద్ర, ఏఓలు మానస, సాయిశివ, సరిత, ఎస్సైలు నాగుల్‌మీరా, రమేష్ హరిత తెలిపారు. శనివారం చింతకాని మండలంలోని నాగులవంచ, చింతకాని, పాతర్లపాడు గ్రామాల్లో, ఎర్రుపాలెం మండలంలోని తక్కెళ్లపాడు, అయ్యవారిగూడెం, ఎర్రుపాలెం, బనిగండ్లపాడు తదితర గ్రామాల్లో, ముదిగొండలోని మేడేపల్లి, ముదిగొండ గ్రామాల్లోని సొసైటీలు, ఎరువుల దుకాణాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీల్లోని ఎరువుల స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, ఇన్వాయిస్‌లు, సేల్ రిజిస్టర్లను తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించి మాట్లాడారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓలు మారగాని శ్రీనివాసరావు, యాలముడి శ్రీనివాసరావు, ఏసుబాబు, ఏఈఓలు బాలకృష్ణ, కృష్ణకుమారి, మౌనిక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



చింతకాని: మాట్లాడుతున్న వైద్యాధికారి ఎండీ ఆల్తాఫ్



ఏన్కూరు: మాట్లాడుతున్న వైద్యాధికారి రాములు

చింతకాని/ఎర్రుపాలెం/ఏన్కూరు/ముదిగొండ: సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారులు ఎండీ ఆల్తాఫ్, ప్రశాంత్, బి.రాములు, అరుణాదేవి, ఎంపీడీఓలు శ్రీనివాసరావు, బాస్కర్‌రావు తెలిపారు. శనివారం చింతకాని, ఎర్రుపాలెంలోని బనిగండ్లపాడు, ఏన్కూరు పీహెచ్‌సీల్లో.. ముదిగొండ మండల పరిషత్ సమావేశ మందిరంలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి రోజూ ఇంటింటి సర్వేను నిర్వహించి జ్వరపీడితులను గుర్తించి, పరీక్షల నిమిత్తం ఆరోగ్య కేంద్రానికి పంపించాలన్నారు. ప్రతీరోజు డ్రైడే కార్యక్రమాలను నిర్వహించాలని, గ్రామ పంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చోట వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. హెల్త్ సూపర్ వైజర్లు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం ఏన్కూరులో.. ప్రతి ఆశాకార్యకర్తకు 25 డెంగీ ఆర్‌డీడీ కిట్లు అందించారు. ఈ సమావేశాల్లో ఎంపీఓ పర్వీన్ ఖైసర్, సీహెచ్‌ఓ వీరేందర్, కిషోర్, ఎంపీఈవో జి.శ్రీలక్ష్మి, వైద్యాధికారులు రంజిత్, కార్తీక్, అశ్విని, ఆర్‌డబ్ల్యూ ఎస్ జేఈ విజయరాజు, సీహెచ్ఓ మధుసూధన్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణారావు, నాగేశ్వరరావు, రేఛల్‌రాణి, పల్లె దవాఖానా వైద్యులు అనీల్, వెంకటేశ్వరరావు, గ్రీష్మ, తబ్సుమ్, ల్యాబ్‌టెక్నిషియన్ రమణ, దుర్గాప్రసాద్, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



తహసీల్దార్ శేషగిరిరావు

ఏన్కూరు: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు కోరారు. శనివారం స్థానిక తహసీల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 3 రోజులు వర్షాలు కురుస్తున్నందున ప్రజలు బయటకు రావొద్దని, విద్యుత్ స్తంభాలు, వైర్లను తాకవద్దని, పురాతన భవనాలకు దూరంగా ఉండాలని, చేపల వేటకు వెళ్లవద్దన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మధిర: మధిర బోడేపూడి భవన్‌లో శనివారం బోడేపూడి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ వల్లూరి రాంబాబు ప్రారంభించారు. అనంతరం వైద్య శిబిరంలో ఆయన పాల్గొని రోగులకు షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. అదే విధంగా కంటి సమస్యలు ఉన్న రోగులకు ఖమ్మం మ్యాక్సీవిజన్ సిబ్బంది ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత ఆపరేషన్ల కోసం బోడేపూడి సేవా సంస్థ ద్వారా అందించడం జరుగుతుందని సంస్థ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు వాసిరెడ్డి సుందరయ్య, నరసింహారావు, రామనర్సయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

ఏన్కూరు: చదువుతోనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడంతో పాటు సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సుమధుర కన్‌స్ట్రక్షన్ సంస్థ అధినేత, పాఠశాల పూర్వ విద్యార్థి మధుసూదన్ అన్నారు. శనివారం స్థానిక గురుకుల పాఠశాలలో 1983–84 సంవత్సరంలో పది చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలను సందర్శించి.. మొక్కలు నాటారు. అనంతరం పదిలో, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఏటీపీ వేమురాజు, పూర్వ విద్యార్థులు సింగరేణి సంస్థ ఇంజనీర్ సాయి, హెచ్ఎం కృష్ణారావు, మువ్వా రవిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమగ్ర చట్టం చేయాలి



మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

తల్లాడ: వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి తెలిపారు. శనివారం దొడ్డా కృష్ణయ్య భవనంలో షేక్ నన్నే సాహెబ్ అధ్యక్షతన నిర్వహించిన ఆ సంఘ మండల మహాసభలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా తల్లాడ మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా మన్నేపల్లి రామారావు, పులి కృష్ణయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రామలింగేశ్వరరావు, నాగేశ్వరరావు, జీవరత్నం, మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

సత్తుపల్లిటౌన్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు చేసిన నేపథ్యంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీహరికి ఫిర్యాదు చేశారు. ఆయనపై కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెన్నారావు, నర్సింహారావు, కమల్‌పాషా, సామేలు, రమేష్, గఫార్‌ఖాన్, కృష్ణయ్య, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ

పెనుబల్లి: పెనుబల్లి మండలం లంకపల్లికి చెందిన చిలుకూరి ప్రమీలారాణి ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబీకులను ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి శనివారం పరామర్శించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ తుల్లూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

చింతకాని: మండలంలోని వందనం గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకులు అమర్లపూడి సుబుద్ది సంస్మరణ సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబుద్ది చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్వరరావు, జిల్లా నాయకుడు మాదినేని రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రాము, నాయకులు జానికిరాములు, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధునికీకరణకు గ్రీన్ 'సిగ్నల్స్'

రూ.17 లక్షతో నాలుగు రోడ్ల కూడలిగా అభివృద్ధి

సాక్షి ఎఫెక్ట్..



జేసీబీతో డివైడర్‌ను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సత్తుపల్లిటౌన్: ట్రాఫిక్ సిగ్నల్స్ ఆధునికీకరణ పనులు మొదలయ్యాయి. ఈ నెల 19న 'సాక్షి' దినపత్రిలో 'సిగ్నల్ లెస్ జర్నీ'శీర్షకన ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. ఈమేరకు సత్తుపల్లి రింగ్ సెంటర్‌ను నాలుగురోడ్ల కూడలిగా అభివృద్ధి చేసేందుకు శనివారం పనులు చేపట్టారు. ఇందుకు వేంసూరు నుంచి అయ్యగారిపేట రోడ్డుకు వెళ్లేందుకు వీలుగా కూడలి ప్రాంతాన్ని విశాలంగా తీర్చిదిద్దనున్నారు. అలాగే రూ.17 లక్షలతో బస్టాండ్ రింగ్‌సెంటర్, కాకర్లపల్లి రోడ్ సిగ్నల్స్‌ను ఆధునీకరణ పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ కొండ్రా నర్సింహా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ సురేష్, శానిటరీ సూపర్‌వైజర్ బాబురావు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

దళిత కాలనీ భూమిని పరిరక్షించాలి



తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

మధిర: తొర్లపాడు గ్రామంలో ఆక్రమణకు గురైన దళిత కాలనీ భూమిని పరిరక్షించాలని కోరుతూ తహసీల్దార్ రాళ్లబండి రాంబాబుకు సీపీఎం మండల కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. శనివారం మధిర తహసీల్‌లో కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మందా సైదులు మాట్లాడుతూ.. తొర్లపాడు ఎస్సీ కాలనీకి సంబంధించిన సర్వేనంబర్ 17లో ఉన్న ప్రభుత్వ పట్టా భూమిని పలువురు ఆక్రమించి వ్యవసాయం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకొని సరిహద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ భూమిలో కమ్యూనిటీ హాల్, లైబ్రరీ తదితర అవసరాల కోసం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు మద్దాల ప్రభాకర్, అమరయ్య, లాలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి



నేరేడలో ఇంటి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న హౌసింగ్ ఏఈ సుప్రియ

చింతకాని: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలను ప్రారంభించాలని హౌసింగ్ మండల ఏఈ సుప్రియ సూచించారు. మండల పరిధిలోని నాగులవంచ, నేరడ, బస్వాపురం గ్రామాల్లో శనివారం ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోయించి నిర్మాణాలను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు గోపి, బస్వయ్య, వీరభద్రం, వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా పీహెచ్‌సీలు



పెద్దకోరుకొండిలో అసంపూర్తిగా నిలిచిన నిర్మాణం

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరు, పెద్దకోరుకొండి జీపీల్లో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రభుత్వం ఒక్కొక్క ఆరోగ్య కేంద్రానికి రూ.20 లక్షలు మంజూరు చేయగా.. నిర్మాణాలు మొదలుపెట్టారు. కానీ నిధులు విడుదలలో ప్రభుత్వం జాప్యం చేయడంతో భవన నిర్మాణాలు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. చెన్నూరు ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో రావికంపాడు, చెన్నూరు, యజ్ఞనారాయణపురం, వెంకటాపురం, ముచ్చవరం, ఓబులరావు బంజరు గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించాల్సి ఉంది. అదే విధంగా పెద్దకోరుకొండి ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో పోచవరం, తాళ్లూరు వెంకటాపురం, మెన్నవెల్లి గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించాల్సి ఉంది. ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోవడంతో వైద్య సిబ్బంది తీవ్ర అసౌకర్యంకు గురవుతున్నారు. సత్వరమే ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాన్ని పూర్తి చేసి వైద్య సదుపాయాలు అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

వితరణలు..

విద్యార్థులకు టై, బెల్టులు అందజేత



టై, బెల్టులు అందిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు, పక్కన పీఆర్‌టీయూ మాజీ జిల్లా అధ్యక్షుడు వైవీ

వైరా: పీఆర్‌టీయూ మాజీ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు (వైవీ) విద్యార్థులకు టై, బెల్టు, ఐడీ కార్డులు పంపిణీ చేయడం అభినందనీయం అని వైరా ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం వైరాలోని ఫిషరీస్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల బాల బాలికలకు వైవీ సహకారంతో టై బెల్టు, ఐడీ కార్డులు ఆయన అందించి మాట్లాడారు. పాఠశాల హెచ్ఎం వెలిశెట్టి నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కాంపెక్స్ హెచ్ఎం మాధవరావు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ రజని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జమలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన ఆర్‌వీ కన్సల్టెన్సీ(హైదరాబాద్) యజమాని తోట కృష్ణశంకర్ నోట్ పుస్తకాలను వితరణ చేశారు. ఆ పుస్తకాలను శనివారం పాఠశాలలో దాత తండ్రి తోట సాంబశివరావు, పాఠశాల హెచ్ఎం ఎస్.జ్యోతి విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఫుల్ వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్ సీజ్

పెనుబల్లి: ట్రాక్టర్‌కు ఫుల్‌వీల్స్ బిగించడంతో రహదారి పాడవుతుండగా ఆర్అండ్‌బీ అధికారులు పట్టుకున్నారు. పెనుబల్లి మండలం కారాయిగూడెం – కొండ్రుపాడు మధ్య ఫుల్‌వీల్స్‌తో తిరుగుతున్న ట్రాక్టర్‌ను ఏఈ బూరుగు మనోజ్ అభిలాష్ గుర్తించి డ్రైవర్ జిజ్జారపు వెంకటేశ్వరరావుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేశామని ఎస్సై వెంకటేష్ తెలిపారు.

ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా మధు



కొనకాల మధు

పెనుబల్లి: పెనుబల్లి మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనకళ్ల మధు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు మారగాని వెంకట్ గౌడ్ ఆధ్వర్యాన శనివారం ఈ ఎన్నిక జరిగింది. అలాగే, కార్యదర్శిగా చాట్ల వీరభద్రం, కోశాధికారిగా జిల్లెల్ల కృష్ణ చైతన్య, జిల్లా కార్యదర్శిగా కనకారావును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో వేముల నరసింహారావు, మల్లెల రాంబాబు, వత్సవాయి కనకాచారి, హరీష్, ఈశ్వరాచారి, మిద్దె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఎన్నిక



వైరా ముస్లిం వెల్ఫేర్ నూతన కమిటీ సభ్యులు

వైరా: వైరాలోని హజ్రత్ అలీ ఇబ్నే తాలీబ్ మజీద్‌లో శనివారం వైరా ముస్లిం వెల్ఫేర్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా షేక్.కౌసర్, ఉపాధ్యక్షుడిగా ఎండీ యాదుల్ ఖురేషీ, షేక్ బాబు, కార్యదర్శిగా ఎండీ అన్వర్, జాయింట్ సెక్రటరీగా షేక్ బాబూజానీ, కోశాధికారిగా షేక్ రంజాన్, సహాయ కోశాధికారిగా షేక్ గౌసలతో పాటు మరో 13మంది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 రమేష్, ACO-9059115968
ఖమ్మం ఎన్. ఉపేందర్ - 99591 24151 మధిర ఎస్.కె. సైదులు - 90524 34278
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా ఐ. రాందాస్ - 98898 81843 టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

రవికుమార్ - 99499 27792
ఎన్. జయరాజు - 96528 68642